నాలుగేళ్లు.. ఐదు ఉద్యోగాలు



2



2

రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## సుదర్శన్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



**అక్షరటుడే, బాల్కొండ:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొత్తింటి మొత్తం రెడ్డి, కాంగ్రెస్ బాల్కొండ మండల అధ్యక్షుడు గున్నాల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.



ఆర్మూర్ బల్దియాలో భారీగా అవినీతి జరిగింది. కొందరు అధికారులు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డట్లు సమాచారం. మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టి వసూళ్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది. 2014 నుంచి 2025 వరకు మున్సిపాలిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు సంసిద్ధమవుతోంది. ఎన్నికల అనంతరం విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది. - అక్షరటుడే, ఆర్మూర్




# ఆర్మూర్ బల్దియాలో భారీగా అవినీతి..!

▪ కోట్లు దండుకున్న పలువురు సిబ్బంది ▪ త్వరలో విజిలెన్స్ విచారణ..? ▪ కదలనున్న అధికారుల డొంక

ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఇటీవల ఏసీబీ అధికారులు దాడులు చేశారు. లంచం తీసుకుంటుండగా అప్పటి మున్సిపల్ కమిషనర్ రాజును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు కమిషనర్ రాజుతోపాటు పలు సెక్షన్లకు సంబంధించిన అధికారులను, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని రాత్రి 2 గంటల వరకు విచారించారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్, మెప్మా విభాగాల్లో అవినీతి జరిగినట్లు గుర్తించారని తెలిసింది. కాలం చెల్లిన వాహనాల కొనుగోలు, వాహనాల రిపేర్లు, శానిటరీ విభాగంలోని ట్రేడ్ లైసెన్స్‌లు, మున్సిపల్ మడిగెల అద్దె వసూళ్లలో అవినీతి తారాస్థాయిలో జరిగినట్లు సమాచారం.

### ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు

ఆర్మూర్ మున్సిపాలిటీలో 2014 నుంచి 25 వరకు 11 ఏళ్ల వ్యవధిలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు సమాచారం. ముఖ్యంగా ప్రభుత్వ, ఇరిగేషన్ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. ఆయా ఇళ్లకు నెంబర్లు కూడా కేటాయించారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు సమాచారం. మరోవైపు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టుల పాత పనులపై ఎంబీ రికార్డులు చేసి బిల్లులు తీసుకున్నట్లు సమాచారం. మున్సిపల్ అధికారుల అండదండలతో కొందరు ప్రభుత్వ, ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించుకొని వెంచర్లు వేశారు. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అధికారులు ధారాదత్తం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో కమిషనర్ రాజు 400 పైచిలుకు అక్రమ ఇంటి నంబర్లపై విచారణ జరిపి 114కు పైగా ఇంటి నంబర్లను రద్దు చేశారు. మిగిలిన వాటికి నోటీసులు జారీ చేశారు.

### ఉద్యోగాల కోసం వసూళ్లు!

మున్సిపాలిటీలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపితే పలువురు అధికారుల డొంక కదలనుంది. 11 ఏళ్లలో ఆర్మూర్ మున్సిపాలిటీలో పనిచేసిన కమిషనర్లతోపాటు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటేషన్, జనన మరణాల సెక్షన్లలో జరిగిన అవినీతిలో ప్రమేయం ఉన్న అధికారుల అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకావం ఉంది. ఈ క్రమంలో పలువురు అధికారులు మున్సిపాలిటీపై ఎలాంటి విచారణలు జరుగకుండా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు కార్యాలయంలో ఇష్టానుసారంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కొక్కరి నుంచి రూ.రెండు లక్షల నుంచి రూ.3 లక్షల వరకు తీసుకొని ఉద్యోగాలు కట్టబెట్టినట్లు సమాచారం. ఇతర జిల్లాలతో పాటు, ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఉద్యోగులు ఇవ్వడం గమనార్హం.

## నిజాంసాగర్ కాలువను ఆధునీకరించాలి: ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి



**అక్షరటుడే, ఆర్మూర్:** నిజాంసాగర్ కెనాల్ ఆధునీకరణకు రూ.1,500 కోట్లు కేటాయించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శనివారం ఆయన ప్రసంగించారు. నిజాంసాగర్ ఆధునీకరణకు సంబంధించిన రూ.7వేల కోట్లు చెల్లించాలని, రెండేళ్ల క్రితం మోటార్లు కాలిపోయినప్పటికీ వాటి స్థానంలో నూతన మోటార్లు ఏర్పాటు చేయలేదని రాకేష్ రెడ్డి కోరారు. గత రెండేళ్లుగా నీటిపారుదల శాఖ మంత్రిని తాను 20 సార్లు కలిసినప్పటికీ నవ్వి వదిలేశారన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాంలు నిర్మించిన నిజాంసాగర్ కాలువ పూడికతో నిండిపోయి అధ్వానంగా మారిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంతో పాటు ప్రత్యేక రాష్ట్రంలోనూ నష్టపోయిన జిల్లా ఏదైనా ఉందంటే అది నిజామాబాద్ జిల్లానేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లా నిజామాబాద్ అని సీఎం, మంత్రులు తమ జిల్లాపై దయ చూపించాలన్నారు. మదనపల్లి నుంచి ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ వరకు నిజాంసాగర్ కెనాలను పునరుద్ధరించాలని ఇందుకు రూ.1500 కోట్లు కేటాయించాలని ఆయన కోరారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులందరికీ న్యాయం చేయాలని రాకేష్ రెడ్డి కోరారు.

## కామారెడ్డి జిల్లా జీపీ కార్యదర్శుల ఫోరం ఎన్నిక



**అక్షరటుడే, కామారెడ్డి :** జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం నూతన కార్యవర్గాన్ని టీఎన్జీవోస్ కార్యాలయంలో శనివారం ఎన్నుకున్నారు. ఎన్నికల్లో భాగంగా అన్ని పదవులకు ఒకటి చొప్పున నామినేషన్ వచ్చినందున.. కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి భక్తవత్సలం ప్రకటించారు. ఫోరం కార్యవర్గం నూతన జిల్లా అధ్యక్షుడిగా మహేష్ గౌడ్, సహాధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్, జిల్లా కార్యదర్శిగా ప్రవీణ్ కుమార్, జిల్లా కోశాధికారిగా అల్లాడి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ, పబ్లిసిటీ సెక్రెటరీ, ఆఫీస్ సెక్రెటరీ, జిల్లా ఈసీ మెంబర్ల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా సహాధ్యక్షుడు చక్రధర్, జిల్లా కోశాధికారి దేవరాజు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ఈసీ మెంబర్ శివకుమార్, సంయుక్త కార్యదర్శి రమణ కుమార్, జిల్లా ఈసీ మెంబర్ దత్తాద్రి, అర్బన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సృజన్, జిల్లా పంచాయితీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఫైనాన్స్ రుణం తీరిపోయినా చెల్లించాలని వేధింపులు..

**అక్షరటుడే, కామారెడ్డి :** ఫైనాన్స్ కంపెనీలో తీసుకున్న రుణం తీరిపోయిందని, ఎన్వోసీ ఇచ్చినా థర్డ్ పార్టీ వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఓ బాధితుడు వాపోయాడు. ఈ క్రమంలో సంబంధిత ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్ కార్యాలయంలో ఆందోళన చేపట్టాడు. కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాకు చెందిన ఇస్లావత్ రాజు 2020లో కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో రూ.7 లక్షల రుణం తీసుకున్నాడు. రెండు నెలల క్రితమే ఫైనాన్స్ రుణం పూర్తిగా చెల్లించడంతో కంపెనీ నుంచి ఎన్వోసీ కూడా వచ్చింది. అయితే రుణం ఇంకా చెల్లించాలంటూ నెలన్నర క్రితం కామారెడ్డి పట్టణంలో కంపెనీకి సంబంధం లేని ఐదుగురు వ్యక్తులు తన కారు ఆపి తనపై దాడికి పాల్పడ్డారని బాధితుడు ఆరోపించాడు. దీంతో వారిని పోలీసులకు పట్టించామని తెలిపారు. అయినప్పటికీ మరోసారి మేడ్చల్‌లో కారు ఆపారని, గట్టిగా మాట్లాడితే వెళ్లిపోయారని పేర్కొన్నాడు. మూడోసారి హైదరాబాద్‌లోనూ కూడా కారు ఆపారని చెప్పాడు. మరోసారి శుక్రవారం కామారెడ్డి పట్టణంలో ఓ నలుగురు వ్యక్తులు కారు ఆపి డబ్బులు చెల్లించాలని ఇబ్బందులు పెట్టారన్నారు. ఈ విషయమై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు పేర్కొన్నాడు. శనివారం దేవునిపల్లిలోని సదరు ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్ కార్యాలయంలో ఆందోళన చేపట్టాడు. రుణం మొత్తం చెల్లించినా, ఎన్వోసీ తీసుకున్నప్పటికీ కారు ఆపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించాడు. తమకు న్యాయం చేయాలని కోరాడు.

## అటవీశాఖ అధికారుల డైరీ ఆవిష్కరణ

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా అటవీశాఖ అధికారుల డైరీని శనివారం ఆవిష్కరించారు. జిల్లాకేంద్రంలోని వర్ని రోడ్‌లో జిల్లా అటవీశాఖ కాంప్లెక్స్‌లో బాసర సర్కిల్ సీసీఎఫ్ శరవణన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన్యప్రాణుల సంరక్షణ, అటవీ సంపద పరిరక్షణ, అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ వంటి కీలక అంశాలపై శాఖ సిబ్బందితో విస్తృతంగా చర్చించారు. రానున్న వేసవికాలంలో అడవుల్లో మంటలు చెలరేగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అటవీశాఖ సిబ్బందికి సూచించారు. ఫారెస్ట్ సిబ్బంది తమ విధి నిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యత, అంకితభావంతో పనిచేయాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో వికాస్ మీనా, ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్లు సుధాకర్ రావు, భవానీ శంకర్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు శ్రీనివాస్, రవిమోహన్‌భట్, రవీందర్, గంగాధర్, జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.






## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి: కలెక్టర్

**అక్షరటుడే, కామారెడ్డి:** మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల కమిషనర్లు, ఇతర అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. షెడ్యూల్ వెలువడిన వెంటనే ఎన్నికలను ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఒక్కోవార్డు వారీగా ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ముసాయిదా జాబితాను ప్రదర్శించాలన్నారు. అభ్యంతరాలను స్వీకరించి సకాలంలో వాటిని పరిష్కరించాలని చెప్పారు. జనవరి 10న తుది ఓటరు జాబితా వెలువరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, సదుపాయాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, సీఈవో చందర్, ఆర్డీవోలు పార్థసింహారెడ్డి, వీణ, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.



## వైద్య వృత్తి ఎంతో పవిత్రమైంది: ఎమ్మెల్యే

**అక్షరటుడే, బాన్సువాడ:** వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, వైద్యులు దేవుళ్లతో సమానమని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం అన్నారు. డీసీహెచ్ఎస్, బాన్సువాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పేద ప్రజలకు సేవ చేవ చేయడం అదృష్టంగా భావించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, నాయకులు కృష్ణారెడ్డి, మోహన్ నాయక్, ఎజాజ్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల పొలం బాట

**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలో విద్యుత్ ఉద్యోగులు పొలంబాట కార్యక్రమం చేపట్టారు. ఎస్ఎస్-421 ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ ఉద్యోగులు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వంగిన పోల్స్‌ను సరిచేశారు. అనంతరం ఏఈ లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, బోరుబావులు వద్ద సొంతంగా మరమ్మతులు చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యుత్ సిబ్బంది, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.





## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి


- వివరాలు 2వ పేజీలో..


## ఎల్లారెడ్డి వాసికి ప్రతిష్ఠాత్మక పోలీసు సేవా పథకం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన సీఐ తోట లింగం ప్రతిష్ఠాత్మక పోలీసు సేవా పతకానికి ఎంపికయ్యాడు. ఈ మేరకు శనివారం వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం తోట లింగం అవినీతి నిరోధక శాఖ హైదరాబాద్ రేంజ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ 2025లో పోలీసు విశిష్ట పురస్కారానికి ఎంపికయ్యారు. 2009 బ్యాచ్ ఎస్సైగా హైదరాబాద్‌లోని మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్లో తోటలింగం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కంచన్ బాగ్, తిరుమలగిరి పోలీస్ స్టేషన్లలో నిక్కచ్చిగా పనిచేస్తూ మంచిపేరు తెచ్చుకున్నారు. పదోన్నతుల్లో భాగంగా సీఐడీ సీఐగా టాస్క్‌ఫోర్స్‌లో పనిచేశారు. హైదరాబాద్ రేంజ్‌లోని అవినీతి నిరోధక శాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా గత ఏడాది నుంచి పనిచేస్తూ ఉత్తమ సేవలకు గాను సేవా పతకానికి ఎంపికయ్యారు.

## నేరాలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తాం: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి :** యువత మంచి మార్గంలో నడవాలని, నేరాలకు పాల్పడితే వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని ఎస్పీ రాజేష్ చంద్ర హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా శనివారం ఏకకాలంలో పాత నేరస్తులు, అనుమానితుల గురించి ఫీల్డ్ లెవెల్ చెకింగ్ నిర్వహించారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రామేశ్వర్‌పల్లి, శాబ్దిపూర్ తండాలో గతంలో చోరీలకు పాల్పడిన సస్పెక్ట్ షీటర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారిని పాపిలాన్ డివైస్ ద్వారా వారిని అక్కడే చెక్ చేశారు. గతంలో వారు చేసిన చోరీల వివరాలు, ప్రస్తుతం వారు ఏ పని చేస్తున్నారో, ఎలా జీవనం సాగిస్తున్నారని అనుమానితుల తల్లిదండ్రులతో మాట్లాడి ఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వారి పిల్లలపై షీట్లు ఎందుకు ఓపెన్ చేయాల్సి వచ్చిందో వివరించారు. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి నేరాలకు పాల్పడకుండా తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఎస్పీ సూచించారు. ఇకపై సత్ప్రవర్తనతో, ఎలాంటి నేరాలు చేయకుండా ఉంటే షీట్ తొలగించే అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలు నివారించవచ్చని తెలిపారు. అనంతరం డ్రైవర్స్ కాలనీ, బతుకమ్మ కుంట ప్రాంతంలో అనుమానితుల వద్దకు ఎస్పీ వెళ్లారు. జిల్లావ్యాప్తంగా గతంలో చోరీలకు పాల్పడిన 792 మందిపై షీట్లు ఓపెన్ చేయబడి ఉన్నాయని తెలిపారు. ఈ షీటర్లపై నిరంతర నిఘా కొనసాగిస్తూ నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే ఎస్సై, సీఐలు, డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారులు స్వయంగా ఫీల్డ్ లెవెల్ చెకింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## నూతన పాలకవర్గానికి సన్మానం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో నూతనంగా ఎన్నికైన పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానించారు. సర్పంచ్, ఉపసర్పంచ్, సభ్యులు పంచాయతీ కార్యదర్శి జీపీవోలకు అంగన్‌వాడీ టీచర్ దుర్గా, గంగవ్వ ఆయాలు లక్ష్మీ చంద్రకళ గురువారం సన్మానించారు. 11 మంది సభ్యులతో కూడిన అంగన్‌వాడీ కమిటీకి ఎన్నుకున్నారు. కమిటీకి ఛైర్మన్‌గా సర్పంచ్‌ను ఎన్నుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.

## ట్రాఫిక్ నియమాలను ప్రతిఒక్కరూ పాటించాలి



**అక్షరటుడే, ఇందూరు:** ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ వాహనాలను నడపాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. జిల్లా వినియోగదారుల సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో నగరంలోని దుబ్బ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదన్నారు. సమావేశంలో ఏఎంవీఐ మణికాంత్, సంఘం అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, లింగయ్య పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## విజయోత్సవ్–2026 పోస్టర్ల ఆవిష్కరణ



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న విజయోత్సవ్-2026 వార్షిక క్రీడా పోటీల పోస్టర్లను హెచ్‌ఎం లావణ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆక్స్‌ఫర్డ్ లిటిల్ చాంప్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్రీడాపోటీలను విజయోత్సవ్-2026 పేరుతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలను తిలకించేందుకు తల్లిదండ్రులు, క్రీడాభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆమె కోరారు. చదువులతో పాటు క్రీడలు పిల్లల జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు. క్రీడల ద్వారా పిల్లల్లో శారీరక దృఢత్వం పెరుగుతుందని, మానసికంగా బలంగా మారడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వేద సాహితీ, తేజస్వి, రేఖ, సౌభాగ్య, వీణ, సునీత, సుష్మా, సవిత, మానస, మౌనిక, గౌతమి తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ

**అక్షరటుడే,బాల్కొండ:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో బట్టు రాజేశ్వర్ 'రహదారి భద్రత జీవితానికి రక్షణ' అనే నినాదంతో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రోడ్డు రవాణా శాఖ అధికారులు రోహిత్ రెడ్డి, సాగర్, మనోజ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గాలంటే ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో ఎన్నో కష్టాలు.. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు.. ఆర్థిక పరిస్థితి అంతంతే.. పూట గడిస్తే చాలనుకునే రోజులు.. అన్నింటిని దిగమింగుకొని ముందుకు సాగాడు ఆ యువకుడు.. లక్ష్యం వైపు అడుగులు వేశాడు.. చివరికి ఉత్తమంగా భవిష్యత్తును నిర్మించుకున్నాడు. ఏకంగా ఐదు ప్రభుత్వ కొలువులను సాధించి తన సత్తాను చాటాడు రత్నావత్ వెంకట్.

– అక్షరటుడే, ఇందూరు

# నాలుగేళ్లు.. ఐదు ఉద్యోగాలు..



▸ బాధలు దిగమింగి.. ఉద్యోగాలు సాధించి.. ▸ గ్రూప్–1 ఉద్యోగమే లక్ష్యంగా వెంకట్ ముందుకు.. ▸ ప్రస్తుతం బీసీ వెల్ఫేర్‌లో ఉద్యోగం



నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని మోపాల్ మండలం ముదక్‌పల్లి గుడితండాకు చెందిన రత్నావత్ చంద్రభాన్ నాయక్, లక్ష్మీ దంపతుల కుమారుడు వెంకట్. తనకు రెండేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయాడు. దీంతో పిల్లల బాధ్యత తల్లిపై పడింది. నిరుపేద కుటుంబం కావడంతో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ముదక్‌పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అభ్యసించాడు. పాలిటెక్నిక్‌లో సీటు రావడంతో నిజామాబాద్ బాలుర కళాశాలలో పూర్తి చేశాడు. అనంతరం ఎంసెట్‌లో మంచి ర్యాంకు రావడంతో హైదరాబాద్‌లో తన అక్క బావలైన రాజు, వనిత సహాయంతో బీటెక్ పూర్తి చేశాడు. ఇంజినీరింగ్ చదివే సమయంలో తల్లి అనారోగ్యంతో మరణించడంతో వెంకట్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ఎస్టీ హాస్టల్‌లో ఉంటూ విద్యాభ్యాసం పూర్తి చేశాడు.

### అవమానాలను భరిస్తూ...

సొంత ఊరిలో.. బంధువులతో.. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు వెంకట్. దీంతో కసిగా లక్ష్యం వైపు అడుగులు వేశాడు. ఎటువంటి శిక్షణ లేకుండానే సొంతంగా అభ్యసించి ఐదు ప్రభుత్వ కొలువులను పొందాడు. మొదటిసారిగా 2021లో సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగాన్ని పొందాడు. మూడేళ్లు బాధ్యతలు సైతం నిర్వర్తించాడు. కానీ ఇంకా ఏదో సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాడు. అదే ఏడాదిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. మళ్లీ 2023లో సివిల్ కానిస్టేబుల్‌గా పొందాడు. 2024లో బీసీ వెల్ఫేర్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా మరో ఉద్యోగాన్ని పొందాడు. ప్రస్తుతం కంజర గురుకులంలో విధులు నిర్వహిస్తున్నాడు. గత ఏడాది గ్రూప్-4 పరీక్ష రాసి తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ఉద్యోగం పొందాడు.

### ఉచిత శిక్షణ...

ఆర్థికంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న వెంకట్ నిరుపేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణను సైతం అందజేస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో పోలీసు కొలువుల కోసం సాధన చేసే విద్యార్థులకు ఫిట్‌నెస్‌పై ఉచితంగా శిక్షణను ఇస్తున్నాడు. గతంలో వెంకట్ అందజేసిన సూచనలు శిక్షణతో పలువురు ఉద్యోగాలు సైతం పొందారు.

### గ్రూప్–1 ఉద్యోగం సాధించడమే లక్ష్యం..

గ్రూప్-1 ఉద్యోగం పొందడమే నా జీవిత లక్ష్యం. ఇందుకోసం నిత్యం శ్రమిస్తున్నాను. ఎన్నో కష్టాలు, అవమానాల మధ్య ప్రభుత్వ కొలువులను తెచ్చుకున్నాను. ప్రస్తుతం బీసీ వెల్ఫేర్‌లో విధులు నిర్వహిస్తున్నాను.

– రత్నావత్ వెంకట్

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు పల్లికొండ విద్యార్థులు




**భీమ్‌గల్, అక్షరటుడే:** మండలంలోని పల్లికొండ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 8 నుంచి 10 వరకు వనపర్తిలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ అండర్ 17 రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు మాలవత్ అఖిల, కొత్తపల్లి శ్రీనిత్ ఎంపికైనట్లు పీడీ చిన్నయ్య తెలిపారు. అండర్ 14 విభాగంలో ఎర్రోళ్ల ధనాశ్రీ, భూక్యా స్నేహ, బందెల చైతన్య ఎంపికయ్యారు. అండర్ 19 విభాగంలో గంధం నక్షత్ర, దేవానపల్లి వర్షిత, పిండి వర్షిణి, మగ్గిడి దీక్షిత, పంగ రాము, మేకల రేవంత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై తమ ప్రతిభను చాటారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను సర్పంచ్ మనీషా అశోక్ సన్మానించారు. అలాగే హాకీ స్టిక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనురాధ, సీనియర్ ఉపాధ్యాయులు శ్యాం, విఠల్ గౌడ్, ఉప సర్పంచ్ ఏనుపోతుల చిన్న బాలయ్య, వీడీసీ సభ్యులు దేవానపల్లి రాజన్న, వేంపల్లి అశోక్, రావూట్ల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేచురల్ ఫార్మింగ్‌పై రైతులకు అవగాహన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ పథకంపై తిమ్మారెడ్డి గ్రామ రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు అవగాహన కల్పించేందుకు శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి సహజ వనరుల ఆధారిత వ్యవసాయం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ముఖ్యంగా సహజ వ్యవసాయ విధానాలు, జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానాలు, దేశీ ఆవుల ప్రాముఖ్యత, మట్టిలో సూక్ష్మజీవుల పాత్ర, పంట వ్యయాలు తగ్గించి లాభాలు పెంచుకునే మార్గాలు వంటి అంశాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఏవో ఎల్లారెడ్డి అనిల్ కుమార్, సైంటిస్ట్ రేవంత్ నాథన్, ఏఈవో రాజాగౌడ్, సర్పంచ్ అనసూయ గంగారెడ్డి, తిమ్మారెడ్డి తండా సర్పంచ్ కోలా రాములు నాయక్, తిమ్మారెడ్డి ఉప సర్పంచ్ గంగామణి శ్యాంరావు, కృషి సఖీలు, మాజీ సర్పంచులు కృష్ణారెడ్డి, వసంతం, మహమ్మద్ అలీ, గ్రామ రైతులు పాల్గొన్నారు.



## బాధితులకు ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే

**అక్షరటుడే, భీమ్‌గల్:** ఆపదలో ఉన్న పేదలకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అండగా నిలిచారు. మోర్తాడ్ మండలం ధర్మోరా గ్రామానికి చెందిన గజ్జెల గౌరి కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. వైద్యుల సూచన మేరకు ఆమె హైదరాబాద్‌లోని నిమ్స్‌లో ఓపెన్ హార్ట్ సర్జరీ నిమిత్తం చేరారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే స్పందించి సీఎం సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాన్ని మంజూరు చేయించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం బాధిత కుటుంబ సభ్యులకు ఈ పత్రాన్ని అందజేశారు. కష్టకాలంలో ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు బాధితులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## బాలికపై లైంగిక వేధింపుల ఘటన

**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్ దేవ్‌పల్లి గ్రామంలో మతిస్థిమితం లేని బాలికపై ఓ వృద్ధుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు బాలికను సమీపంలోని కాలువ కట్ట వద్ద ఉన్న చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లి అసభ్యంగా ప్రవర్తించినట్లు గ్రామస్థులు తెలిపారు. అయితే బాలిక ధైర్యంగా అతడి నుంచి తప్పించుకొని గ్రామస్థులకు సమాచారం అందించింది. ఘటనపై స్పందించిన గ్రామస్థులు వెంటనే వృద్ధుడిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట్ మండలం తల్వేద గ్రామ శివారులోని తల్వేద వాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు మహిళ మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి ఎడమ చేతిపై మేఘన అని టాటూ వేసి ఉందని.. ఇతర సమాచారం కోసం నందిపేట్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు. నందిపేట్ ఎస్సై 87126 59861, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి 87126 59859 సంప్రదించాలన్నారు.



నగరంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులు..



బీసీటీయూ ఆధ్వర్యంలో..



ఆర్మూర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో..



చిన్నరాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో..

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

మహిళలు చదువుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్న మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని వక్తలు కొనియాడారు. ఉమ్మడిజిల్లాలో సావిత్రిబాయి పూలే జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహాలకు ఘనంగా నివాళులర్పించారు. పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



భీమ్‌గల్ మండలం జగిర్యాల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..



ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో..



బాన్సువాడ శశాంక్ డిగ్రీ కళాశాలలో..



మెండోరాలో..



ఆలూర్‌లో..



భీమ్‌గల్ మండలం లింగాపూర్‌లో..